www.vishalabharati.com
epaper:vishalabharati.com
TELANGANA POLITRICKS
పొలిట్రిక్స్
2023-2024
విశాల భారతి
vishalabharathi Telugu Daily
శుక్రవారం, 08.09.2023
హైదరాబాద్
1.00 pm edition

పొలిట్రిక్స్



'సెప్టెంబర్ 17' చుట్టూ తెలంగాణ రాజకీయం

- పోటాపోటీగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్యక్రమాలు
- పాలమూరు ట్రయల్ రన్ పేరిట బీఆర్ఎస్
- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ సభకు ఏర్పాట్లు
- పరేడ్ గ్రౌండ్స్ లో బీజేపీ అమృతోత్సవం

తెలంగాణ విమోచన దినంగా పేర్కొనే 'సెప్టెంబర్ 17' రాబోయే ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలతో రాజకీయంగా సెగలు పుట్టించనున్నది. ఆధిపత్యం చాటుకునేందుకు దీన్ని సరైన అవకాశంగా అటు అధికార బీఆర్ఎస్, ఇటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ భావిస్తున్నాయి. అందుకే ఆ రోజు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

"సెప్టెంబర్ 17"చుట్టూ తెలంగాణ రాజకీయం తిరుగుతుంది.సెప్టెంబర్ 17వ తేదీన టార్గెట్ చేసి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించి పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభలు పెట్టి కేసీఆర్ ను టార్గెట్ చేయాలని ప్రతిపక్షాలు భావిస్తుంటే, ప్రతిపక్షాలకు చెక్ పెట్టేలా భారీ వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నారు సీఎం కేసీఆర్.సెప్టెంబర్ 17వ తేదీన సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ ప్లాన్ చేసింది.మరోవైపు తెలంగాణలో ఈనెల 16, 17 తేదీలలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 17వ తేదీన భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తోంది. ఈ భారీ బహిరంగ సభను కాంగ్రెస్ పార్టీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. ఇక ముఖ్యమంత్రి కేసీఆర్ పదహారో తేదీన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ పథకంలోని మోటర్లు ఎత్తిపోసే జలాలను ఊరూరా తీసుకెళ్లి స్థానిక దేవతలకు అభిషేకం చేయాలని పార్టీ శ్రేణులకు బిఆర్ఎస్ పిలుపునిస్తుంది.

పది లక్షల మందితో సభకు కాంగ్రెస్ ప్లాన్

ఈ నెల 16, 17 తేదీల్లో సి డబ్ల్యూ సి సమావేశాలు నిర్వహించేందుకు తెలంగాణ పీసీసీ సిద్ధమవుతోంది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకులు, ప్రతినిధులు, ఇతర నాయకులు కలిపి దాదాపు 3 వందల మంది హాజరయ్యే అవకాశం ఉందని పీసీసీ అంచనా వేస్తోంది. ఆ స్థాయిలో ఏర్పాట్లపై పీసీసీ ఫోకస్ పెట్టింది.దీనిని రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ ప్రారంభ సభగా భావిస్తున్నారు.నిజానికి కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లోనే భారీ బహిరంగ సభ నిర్వహించాలని రక్షణ శాఖకు దరఖాస్తు చేసుకుంది.కాని బీజేపీ అమృతోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఎల్బీ స్టేడియం లో నిర్వహించుకొనేందుకు అంగీకారం లభించింది.కాని పది లక్షల మందితో సభ ప్లాన్ చేస్తుండడంతో వేరే స్థలాన్ని పరిశీలిస్తున్నారు.

పరేడ్ గ్రౌండ్స్ లో బీజేపీ అమృతోత్సవం

సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభకు కమలం పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం తమ తమ పోలింగ్ బూతుల్లో జాతీయ జెండా ఆవిష్కరించి.. సాయంత్రం సభకు వచ్చే విధంగా బీజేపీ నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అమృతోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు.

తగ్గేదేలే అంటున్న బీఆర్ఎస్

ప్రతిపక్షాల సన్నాహాలు ఇలా ఉంటే మరోవైపు అధికార పార్టీ బీఆర్ఎస్ కూడా ఈ విషయంలో తగ్గేదేలే అన్నట్లు దూకుడు ప్రదర్శించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈసారి కేసీఆర్ రూటు మార్చారు. బీజేపీ, కాంగ్రెస్‌ల ఎత్తుగడలకు చెక్ పెట్టేలా సెప్టెంబర్ 16 లేదా 18వ తేదీన భారీ బహిరంగ సభ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని నిర్ణయించిన బీఆర్ఎస్ పార్టీ అదే రోజు భారీ బహిరంగ సభను నిర్వహించాలని చూస్తోంది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో సెప్టెంబర్ 17 మరోసారి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారనుంది.

– దేశగౌని రామకృష్ణ గౌడ్, షాద్‌నగర్

'భారత్' గా పేరు మార్చేందుకు బీజేపీ రాజకీయం!

'ఇండియా' కూటమి పేరును 'భారత్' గా మార్చుతామంటున్న కాంగ్రెస్

- దేశ రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య పొలిటికల్ వార్
- ఎవ్వరు నెగ్గేది, తగ్గేది నిర్ణయించేది ప్రజలే..

విశాల భారతి, స్టేట్‌బ్యూరో: బీజేపీ ,కాంగ్రెస్ మధ్య పేర్ల వివాదం రోజురోజుకు పెరుగుతోంది. చిలికి చిలికి గాలి వానగా మారింది. యూపీఏ కూటమి 'ఇండియా' పేరుతో రాజకీయాలు చేస్తుంటే, బీజేపీ తాము తక్కువేం కాదంటూ దేశం పేరునే మార్చేస్తామంటూ రాజకీయాలు చేపట్టారు. ఇంతకీ ఎవరు నెగ్గుతారు అన్నది ప్రజలు నిర్ణయించే అవకాశం ఉంది. 'ఇండియా' పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలను తిప్పికొట్టేందుకు బీజేపీ నేతలు పేరు మార్పు పై దృష్టిసారించారు. ఇప్పటికే 'ఇండియా' గా పిలుస్తున్న దేశాన్ని 'భారత్' అని నామకరణం చేసి పిలువాలని సూచించారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రెసిడెంట్ ఆఫ్ భారత్, ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ భారత్ అంటూ పరిగణించాలని స్పష్టం చేసింది. ప్రతిపక్షాలు సైతం తాము వెనకాడబోమని, ఇండియా కూటమి

పేరును 'భారత్' గా మార్పు చేస్తామని స్పష్టం చేశారు. అందుకోసం కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ 'భారత్' అంటే ఏమిటో వివరించారు. 'BHARAT' అంటే 'Alliance for Betterment, Harmony And Responsible Advancement for Tomorrow' అంటే .. రేపటి అభివృద్ధి, సామరస్యం, బాధ్యతాయుతమైన పురోగతి కూటమి అని ఆయన వివరించారు. దీనితో పేరు మార్పు విషయం పై కేంద్రం వెనక్కి తగ్గుతుందా లేక ఇదే విధానం ను కొనసాగిస్తుందా అన్నది చర్చాంశం గా మారింది. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' అంటుందా? లేక 'భారత్' అంటూ ప్రజల్లో కి వెళ్తోందా? ఎదురుచూడాల్సిందే.

ఓ పక్క బీజేపీ, బీఆర్ఎస్‌పార్టీల నుంచి అసంతృప్తులు 'హస్తం' గూటికి క్యూ కడుతుండడంతో ఫుల్‌జోష్‌లో ఉన్న కాంగ్రెస్‌కు మరోపక్క హైకమాండ్ఇటీవల వేసిన కొత్త కమిటీలు చిక్కులు తెచ్చి పెడుతున్నాయి. ఆయా కమిటీల్లో స్థానం దక్కలేదని పలువురు సీనియర్లు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో హైకమాండ్ పెద్దలు వారిని బుజ్జగిస్తున్నారు. టీకాంగ్రెస్ లో వర్గ పోరు వెరీ కామన్‌అని నేతలు చెప్తున్నా.. దీని ప్రభావం పార్టీ బలోపేతం , ముఖ్యంగా వచ్చే ఎన్నికలపై తీవ్రంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

అలకలు, బుజ్జగింపులు!

టీకాంగ్రెస్ లో ఎన్నికల వేళ కమిటీల చిచ్చు

ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో సీనియర్ల అసంతృప్తి

ప్రజాక్షేత్రంలో ఉన్నవారిని గుర్తించకుంటే ఎట్లా?

బహిరంగంగానే ప్రశ్నించిన సీనియర్‌నేత 'కోమటిరెడ్డి'

సోనియా దృష్టికి తీసుకువెళ్తామని వేణుగోపాల్ హామీ

ప్రాధాన్యం కల్పిస్తామంటూ హైకమాండ్ బుజ్జగింపు

విశాల భారతి, స్టేట్ బ్యూరో :

టీ కాంగ్రెస్ లో వర్గ పోరుసాగుతోందా? నేతల మధ్య విభేదాలు ఉన్నాయా? వాటి ప్రభావం పార్టీ పై ఉంటుందా? నేతలు ఎందుకు అలకబూనుతున్నారు? బుజ్జగింపులతో పెద్దమనుసు తెచ్చుకున్నారా? లేదా? ఇవ్వనీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌పెద్దల మనసుల్లో మెదులుతున్న భయాలు. అసలు రాష్ట్రంలోని సీనియర్లకు ఏమైంది? వారిలోవారు కొట్టుకుంటే ఇతర పార్టీలు అధికారాన్ని తన్నుకుపోయేలా ఉందని క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు వాపోతున్నారు. హైకమాండ్ పెద్దలు పార్టీ సీనియర్‌అయిన వెంకట్‌రెడ్డి లాంటి ప్రజాధరణ ఉన్న నేతలను ఎందుకు దూరం పెడుతున్నారు అన్న చర్చ కూడా సాగుతోంది.

సీనియార్టీకి ప్రాధాన్యం లేదని..

సెప్టెంబర్ 16,17 తేదీల్లో రాష్ట్రం లో కాంగ్రెస్‌పార్టీ కీలక మీటింగ్ తలపెట్టింది. గత రెండు రోజులు కాంగ్రెస్ నేతలు ఓ ప్రైవేట్‌హోటల్‌లో మీటింగ్‌నిర్వహించారు. సదరు మీటింగ్‌కు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరు కాలేదు. దీంతో కాంగ్రెస్ లో మరోసారి విబేధాలు వెలుగులోకి వచ్చాయి. స్క్రీనింగ్ కమిటీ, సీడబ్ల్యూసీ కమిటీ సమావేశానికి వెంకట్ రెడ్డి దూరంగా ఉన్నారు. అయితే సీడబ్ల్యూసీ, కేంద్ర ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ లో హైకమాండ్‌కోమటి రెడ్డి కి స్థానం కల్పించలేదు. దీంతో ఆయన తన అసంతృప్తిని బహిర్గతంగానే వెల్లడించారు. ఇటీవల జరిగిన ఏ మీటింగ్‌కు వెళ్లలేదు. దీంతో రాష్ట్రంలో అధికారం లోకి రావాలని ఆశిస్తూ మహిళా, రైతు, యువత, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్లతో జోష్‌గా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీకి కోమటిరెడ్డి లాంటి కీలక నేత యాక్టివ్‌లేకపోతే కష్టమని భావించింది. ఆయనను బుజ్జగించింది.

కొందరు లోలోపల అసంతృప్తి..

కమిటీల్లో స్థానం దక్కుతుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక్కరే తమ అసంతృప్తిని బహిర్గతం చేసినా.. తమకు పదవులు రాలేదని చాలా మంది సీనియర్లు లోలోపల రగులుతున్నారు. వి. హనుమంతరావు, జానారెడ్డి, సీతక్క, చిన్నారెడ్డి లాంటి వారికి కూడా హైకమాండ్ మొండిచేయి చూపించింది. అదే సమయంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దాదాపు అన్ని కీలక కమిటీల్లో స్థానం పొందడంతో వీరంతా అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. కానీ బహిర్గతం కాలేదు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిన్నారెడ్డి లాంటి నేతలు పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దానికి తోడు హైకమాండ్, పీసీసీ తీరుతో కొన్ని రోజులుగా కోమటిరెడ్డి తన సెగ్మెంట్‌పరిధిలో తప్పా .. మిగతా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో రంగంలోకి దిగిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ కోమటిరెడ్డి ఇంటికి వెళ్లి బ్రేక్‌ఫాస్ట్‌చేసి బుజ్జగించారు. సోనియాగాంధీ దృష్టికి తీసుకెళ్లి పదిరోజుల్లో ప్రాధాన్యమున్న పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం ఢిల్లీకి బయలుదేరిన వేణుగోపాల్ ను ఉదయం 4 గంటలకే వెళ్లి కలిసిన వెంకట్‌రెడ్డి పార్టీ లో నేతల మధ్య ఉన్న విబేధాలను వివరించారు. కష్టకాలంలో రాష్ట్రంలోపార్టీ కోసం పనిచేసిన నేతలను గుర్తించాలని సూచించారు. తనకు కూడా సీడబ్ల్యూసీ లో స్థానం కల్పించాలని కోరినట్లు సమాచారం. ఇదే విషయంపై కేంద్ర కాంగ్రెస్ నేతల దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారని వివరించారు.

కోమటిరెడ్డికి స్థానం ఇవ్వకపోవడం సరికాదు..

మాజీలకు పెద్దపీటలు వేసి ప్రజా జీవితంలో ఉన్న వారికి మాత్రం ప్రాధాన్యం ఇవ్వకపోవడాన్ని పలువురు పీసీసీ , క్షేత్ర స్థాయి నేతలు తప్పుపడుతున్నారు. కోమటిరెడ్డి లాంటి స్టార్‌క్యాంపెయినర్ కే కమిటీల్లో అవకాశం కల్పించపోవడంతో ప్రజల్లోకి ఎలాంటి సంకేతాలు వెళ్తాయని వారు ప్రశ్నిస్తున్నారు.

కలిసి పనిచేయకపోతే నష్టమే..

కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో అధికారం లోకి తీసుకురావల్సిన అవసరం బాధ్యత స్థానిక లీడర్లపై ఉంది. అధికారం లోకి తీసుకురావడాన్ని పక్కన పెట్టే అలకబూని పక్కదారిపడితే నష్టపోయేది పార్టీ ఆపై నేతలు కూడా ఈవిషయం నేతలకు ఎందుకు అర్థం కావడం లేదో తెలియడం లేదు. ఇప్పటికైనా అలకమాని పార్టీకోసం పనిచేస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లోకి రావడం ఖాయం.. లేదంటే చేచేతులా భవిష్యత్‌ను నాశనం చేసుకున్నవారవుతారు.. ఇప్పటికైనా నేతలు మనసు మార్చుకుంటే సరే లేదంటే కష్టాలు తప్పవు.. ఏం చేస్తారో కాలమే సమాధానం చెప్పనుంది. అందాక ఓపిక తప్పదు మరి.

మునుగోడులో గెలుపు గుర్రాల వేట!

అభ్యర్థుల ఎంపికపై ఫోకస్ చేసిన ప్రధాన పార్టీలు

సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీఆర్‌నే దింపిన బీఆర్ఎస్

బీసీ వాదంతో బీఆర్ఎస్‌లో ఆశావహుల అలజడి

నేతల బలాబలాలపై కాంగ్రెస్, బీజేపీ కసరత్తు

పాతవారిని మార్చేందుకు రెండు పార్టీల మొగ్గు

'పొత్తు పొడుపు' పై ఆశలు పెట్టుకున్న కామ్రేడ్లు



విశాలభారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి:

రాష్ట్రంలో ఎలక్షన్ హీట్ షురూ అయ్యింది. మరికొద్ది రోజుల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల యుద్ధం మొదలుకాబోతుంది. ఇప్పటికే అన్ని ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాలపై ఫోకస్ చేశాయి. బైపోల్స్ తో గతేడాది తెలంగాణ రాజకీయాలనే షేక్ చేసిన మునుగోడులో ఈ ఎన్నికల్లో ఏ ప్రధాన పార్టీ నుంచి ఎవరు పోటీ చేయబోతున్నారనే చర్చ మొదలైంది. గతేడాది బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు కొత్తవారు కూడా జోరుగా ప్రయత్నాలు చేస్తుండడంతో మునుగోడు ఎలక్షన్‌వార్ ఎలా ఉండబోతుందనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారింది.

ఉద్యమ గడ్డగా పేరు..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రజా ఉద్యమాల ప్రభావం ఎక్కువగా ఉన్న మునుగోడు నియోజకవర్గంలో బీసీ జనాభా ఎక్కువగా ఉంటుంది. నియోజకవర్గం ఏర్పడిన రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం ఉండగా.. ఆ తర్వాత కమ్యూనిస్టుల కంచుకోటగా మారింది. కానీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రభావం, వర్తమాన రాజకీయల్లో చోటు చేసుకుంటున్న పరిస్థితులతో ఇక్కడ కమ్యూనిస్టుల ప్రాభవం క్రమంగా మసకబారింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎర్రన్నల ఇలాకాలో గులాబీ జెండా ఎగిరింది. ఆ తర్వాత జరిగిన ముందస్తు ఎన్నికల్లో 'హస్తం' పార్టీ విజయం సాధించింది. నాన్‌లోకల్‌అయినా.. అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించారు. అనంతరం ఆయన బీజేపీలో చేరడం, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో గతేడాది బైఎలక్షన్ జరిగింది. ఈ ఎన్నికల్లో భాగంగా కామ్రేడ్లతో పొత్తు పెట్టుకున్న బీఆర్ఎస్ 10 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది.

పాత అభ్యర్థులనే దింపుతారా? మార్చుతారా?

మరికొద్ది నెలల్లోనే మరోసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల నుంచి పాత అభ్యర్థులే బరిలో ఉంటారా? లేక మారుతారా? అన్న చర్చ నియోజకవర్గంలో జోరందుకుంది. గతేడాది జరిగిన బైఎలక్షన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె స్రవంతి బరిలోకి దిగగా.. బీఆర్ఎస్ నుంచి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నిలబడ్డారు. ఇక బీజేపీ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ 10 వేల ఓట్లకు పై మెజార్టీతో గెలుపొందగా, బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. ఇక కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన స్రవంతికి కేవలం 23 వేల ఓట్లు రావడంతో డిపాజిట్ కోల్పోయింది. ఇక భారీ అంచనాలతో దిగిన బీఎస్పీకి కేవలం 4 వేల ఓట్లు రాగా.. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కు 805 ఓట్లు రావడం విశేషం.

మార్పు ఖాయమంటున్న పరిణామాలు

అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు మారే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ నుంచి చలమల కృష్ణారెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్‌పార్టీకి నియోజకవర్గంలో అన్నీ తానై నడిపిస్తున్నారు. ఇంటింటికి పాదయాత్ర కూడాషురూ చేశారు. గ్రామ గ్రామాన తిరుగుతున్నారు. పీసీసీ చీఫ్‌రేవంత్‌రెడ్డి ఆశీస్సులు కూడా ఆయనకు పుష్కలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దాదాపు ఆయనే బరిలో ఉంటారని తెలుస్తోంది. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోటీపై అనేక రకాలుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆయన బీజేపీలోనే కొనసాగుతుండగా.. మళ్లీ ఇక్కడ్నుంచే పోటీ చేస్తారా? లేదా? అనే దానిపై క్లారిటీ రావటం లేదు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉందన్న టాక్ కూడా వినిపిస్తోంది. ఒకవేళ అలా జరగకపోతే బీజేపీ అభ్యర్థిగా మునుగోడులో మళ్లీ ఆయనే పోటీ చేయటం ఖాయంగా కనిపిస్తోంది.

కోమటిరెడ్డి బరిలోకి దిగకపోతే..

ఆయన బరిలో ఉండకపోతే పార్టీ సీనియర్ నేత మనోహర్ రెడ్డి ఉండే ఛాన్స్ ఉంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విషయానికొస్తే అత్యంత ఆసక్తిని రేపుతోంది. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే కూసుకుంట్లకు టికెట్ దక్కే అవకాశాలు చాలా తక్కువ అన్న చర్చ నియోజకవర్గంలో జోరుగా సాగింది. గత ఉపఎన్నికల టైంలోనే ఆయన అభ్యర్థితత్వాన్ని సొంత పార్టీ నేతలే తీవ్రంగా వ్యతిరేకించారు. హైకమాండ్ పెద్దల ఎంట్రీతో అసమ్మతి నేతలతో చర్చలు జరిపి ఒప్పించే ప్రయత్నం చేశారు. ఉపఎన్నిక కోసం పార్టీ అంతా కష్టపడినప్పటికీ, ఆయనకు కేవలం 10 వేల మెజార్టీనే వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయనకు మరోసారి టికెట్ ఇస్తారా? లేదా ? అనేది అనుమానంగా మారింది.

ఎర్రన్నలు ఎటు వైపు?

నియోజకవర్గం ఏర్పాటైన తర్వాత రెండు ఉప ఎన్నికలు సహా ఇప్పటి వరకు 17 సార్లు జరిగిన ఎన్నికల్లో .. 1952 ఎన్నికల్లో పీడీఎఫ్ సహా సీపీఐ ఇక్కడి నుంచి ఏడు సార్లు గెలిచింది. మరో ఎనిమిది పర్యాయాలు కాంగ్రెస్ విజయం సాధించగా ఒక ఉప ఎన్నిక సహా బీఆర్ఎస్ రెండు విజయాలు దక్కించుకుంది. ఈ గణాంకాలను పరిగణలోకి తీసుకునే తమకు పట్టున్న నియోకవర్గంగా అటు సీపీఐ, ఇటు కాంగ్రెస్ భావిస్తాయి. ఈ సారి ఈ ఇరు పార్టీల మధ్య పొత్తు దాదాపు ఖాయమనుకుంటున్న తరుణంలో సీపీఐ పోటీకి సిద్ధమవుతోంది. మరో వామపక్ష పార్టీ సీపీఎం కు కూడా ఈ నియోజవకర్గంలో కనీసం పదివేల ఓట్లు సాధించేంత బలం ఉంది. ఇది సీసీఐకి అదనపు బలం కానుంది. కేంద్ర స్థాయిలో ఏర్పాటైన 'ఇండియా' కూటమిలో సీపీఐ కూడా ఉండడంతో.. రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు దాదాపు ఖాయమంటున్నారు. ఇదే జరిగితే.. సీపీఐ కచ్చితంగా అడిగే స్థానాల్లో మునుగోడు ఒకటి.

బీసీ నినాదంతో ఆశావహుల సందడి..

మునుగోడుపై బీఆర్ఎస్‌సీనియర్ నేత కర్నె ప్రభాకర్ కూడా బీసీ కోటాలో ఆశలు పెట్టుకున్నారు. ఆయనే కాకుండా నారబోయిన రవి కూడా సీటును గట్టిగానే ఆశిస్తున్నారు. ఇటీవలే బీఆర్ఎస్ లో చేరి గౌడ కార్పొరేషన్ గా చైర్మన్‌గా అవకాశం దక్కించుకున్న ఉద్యమ నాయకుడు, తెలంగాణ జర్నలిస్టుయూనియన్ అధ్యక్షుడు పల్లె రవి కుమార్ గౌడ్ కూడా సీరియస్ గా ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా బీసీ లీడర్లు ఎవరికి వారుగా ప్రయత్నాల్లో ఉంటే కొద్దిరోజులుగా గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు, గుత్తా అమిత్ రెడ్డి నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు. సామాజిక, సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలతో కూడా సంప్రదింపులు జరుపుతూ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో పడ్డారు. పార్టీ టికెట్ దక్కించుకొని మునుగోడు లేదా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఏదైనా ఒక నియోజకవర్గం నుంచి బరిలో ఉండాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపు అభ్యర్థిగా ఎవరు ఉంటారనేది మాత్రం అత్యంత ఆసక్తికరంగా మారింది. ఇక బీఎస్పీ నుంచి మరోసారి శంకరాచారినే ఉండే అవకాశం ఉంది. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ మరోసారి మునుగోడు పాలిటిక్స్ రసవత్తరంగా మారటం ఖాయంగా కనిపిస్తోంది. ఇక రేసులో ఉండే అభ్యర్థులు ఎవరనే దానిపై రాబోయే రోజుల్లో మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.